# యాంత్రికం

రామ్మూర్తికీమధ్య ప్రపంచం నవనవలాడుతూ కనిపిస్తోంది. ఎక్కడచూసినా ఆనందం తాండవిస్తున్నట్టు ఫీలవడం ప్రారంభించాడు. "జీవితమే మధురమో రాగ సుధా భరితమో...." అని కూనిరాగాలు తియ్యడం కూడా మొదలుపెట్టాడు; కొత్తగా పెళ్ళయిన రామ్మూర్తి. ఎం. ఏ. పట్టభద్రుడు. వయస్సు సుమారు పాతిక. రాజమండ్రి ఆర్ట్సు కాలేజీలో ఇంగ్లీషు లెక్చెరరు పదవి నలంకరించివున్నాడు. రామ్మూర్తి భార్యసీత. భర్తయెడ భక్తి, మితిలేని ప్రేమాను- అనుకూల దాంపత్యం.... యిక ఆస్తికేం కొదవలేదు. కనుక, జీవితం సుఖంగా సునాయాసంగా గడపగలగడానికి తగిన హంగులన్నీ ఉన్నట్టే. యిక తనవంతు సుఖంగా గడపడమే........దానికేం? గడిపేస్తాడు!

రెండేళ్ళు గడిచిపోయినయ్——

రోజూ షికారుకెళ్తూండడమనేది సుఖజీవనాన్ని గడపదల్చుకున్న రామ్మూర్తి ముఖ్య అలవాటు. ఒక రోజు సంధ్యా సమయంలో రామ్మూర్తీ సీతా- యిసకతిన్నెల మీదకి షికారువెళ్ళారు. చుట్టూవున్న సుందరప్రకృతినీ-ఎదురుగా వున్న నిర్మల గౌతమినీ-పక్కనున్న సీతనీ, చూసుకొని పదే పదే "రాగ సుధా భరితమో.... జీవితమే...." అని ఈలలు వేసుకున్నాడు జీవితాన్నుద్దేశించి. సుధాభరితమైన కబుర్లు చెప్పుకుంటూ ఒక గంటసేపు గడిపేశారు మధురంగా.... తల తిరుగుతున్నదన్నది సీత. యింతసేపూ హాయిగా చలాకీగా వున్న సీతకి యింతలో యేమొచ్చిందో అనుకుంటూ "యింటికి వెళిపోదామా" అన్నాడు, యిష్టం లేకపోయినా. యిద్దరూ యిసుక తిన్నెల్లో నడవడం ప్రారంభించారు. కొంతదూరం వచ్చి వాంతులు చేసుకున్నది సీత. యిన్నాళ్ళూ తలనొప్పికూడా ఎరగనిది యిప్పుడు వాంతులు చేసుకోవడంలో అర్థం కనిపించలేదు రామ్మూర్తికి యింటికి వెళ్ళి తల్లి వల్ల అసలు సంగతి గ్రహించి ఎగిరి గంతేశాడు.

"పాపాయి....ఆడపిల్లా, మొగపిల్లాడా....?

"ఎవరయితేనేం పాపాయి.... బుల్లి పాపాయి."

మరో యేడునెల్లకి ఒక ఆడపిల్ల తండ్రయి కూర్చున్నాడు. ప్రప్రథమంగా ఆడపిల్ల కలిగినప్పుడు చాలామంది విచారపడే విషయం తెలిసిన రామ్మూర్తికి విచారం కలుగలేదు.

పోన్లే.... అనుకున్నాడు తృప్తికోసం

రామ్మూర్తి ఏ విషయాన్నీ అంతగా పట్టించుకోడు. నిర్లిప్తమయిన మనిషి ఆశ్చర్య సంభ్రమాల్లాంటివి అతనిలో అంత దబ్బున కలగవ్.

మూడేళ్ళు గడిచిపోగా 'వంశోద్ధారకుడైన' ఒక మొగపిల్లాడు పుట్టాడు. మొహం చేటంత చేసుకోబోయాడు గాని-చాతగాలేదు మొదట పుట్టిన ఆడపిల్ల "నాన్నా" అనడం నేర్చుకొని, తల్లి వళ్లో ఉన్న తమ్ముడిక్కూడా "నాన్నా" అనడం నేర్పింది-పట్టుబట్టి.

అతని దైనందిన కార్యక్రమంలో మార్పు వచ్చింది. షికార్లు కొట్టేకాలం, "రాగసుధా భరితమో...." అని కూనిరాగాలు తీసే కాలం హరించిపోయింది. పూర్వం రోజుల్ని తలచుకొని ఏదో పోయినట్టు బాధపడుతున్నాడు.

అతని తండ్రికి జబ్బుచేసింది. డాక్టర్లొచ్చారు. మందులు, ఇంజక్షన్లూ యిచ్చారు. తల్లి ఎప్పుడూ ఆయన మంచాన్ని వొదిలేది కాదు. ఆవిడ అప్పుడప్పుడూ దేవుడి గదిలోకెళ్ళి కంటతడి పెట్టుకుని, మాంగళ్యాన్ని ముద్దు పెట్టుకొని, వస్తూ వస్తూ దేవుడికొక దణ్ణం పెట్టేది. తండ్రి అస్తమానూ దగ్గు తెరల్నాపుకుని చెప్తూవుండే ఆస్తి గొడవలు, బంధు వర్గంతో వచ్చే లావాదేవీలు—''అవన్నీ ఇప్పుడెందుకూ'' అనలేక చచ్చినట్టువింటున్నాడు. ఇవ్వాళ డాక్టరు తనని పక్కకి పిలిచి కొంచెం వ్యవహారం 'యిది'గా వున్నట్టుంది. అయినా నేచూస్తాన్లెండి. యెలాగోలా బయట పడేలా అని చెప్పాడు. తల్లి రాయమంటే ముఖ్య బంధువులకి ఉత్తరాలు రాశాడు. తనమీద ప్రేమ చేతో, మరెంచేతో తెలీదు గానీ, మర్నాడే ఒక పాతికమందివరకూ వచ్చిపడ్డారు బంధువులు. తండ్రికి స్వస్థత చేకూరిండి.... ఓ నెలవుండి బంధువులు ఇళ్ళదారి పడుతున్నారు. తల్లి సంతోషించింది. మర్నాడు రాత్రి తండ్రి చచ్చిపోయాడు. మళ్ళా ఉత్తరాలు రాశారు. కర్మదినాలు పూర్తయి, బంధువులు చేతనయినంతా వుండి-యిళ్ళ మొహం చిత్తగించారు.

రామ్మూర్తి తత్వంలో ఏదో జరిగింది మార్పు. ఆలోచిస్తున్నాడు. గూడ్సులా కాలం బరువుగా గడుస్తోంది కాలేజీకి వెళ్తున్నాడు, వస్తున్నాడు. సంవత్సరాలు సంవత్సరాలు గడిచిపోతున్నాయి.

రామ్మూర్తికి జీవితం యాంత్రికం అనేభావం కలిగి ఉలిక్కిపడ్డాడు. ''రాగ సుధా భరితమో....'' అని పూర్వం కూనిరాగాలు తీసిన జీవితాన్ని యిప్పుడు 'యాంత్రికం' అనడానికి ఏదో ఆత్మీయత అడ్డొచ్చింది. 'యాంత్రికం' అన్న భావాన్ని బలమంతా ఉపయోగించి గెంటేసి మాయమవుతున్న 'రాగసుధా

భరితా'న్ని బయిటికితెచ్చి....అవునని నవ్వబోయాడు. ప్రస్తుతం ఇద్దరాడ పిల్లలు ఒక మొగ పిల్లాడు, మొన్న శ్రావణమాసంలో జన్మించిన ఆడపిల్లతో. మొదటి పిల్లకి జబ్బుచేసి చచ్చేటంత శ్రమా,డబ్బా పెడితే చావకుండా బ్రతికింది పలకరించడానికి వచ్చినట్టే వచ్చి పెద్దనాన్న తోడల్లుడి అన్నగారు భాగవతయ్య రెండు నెలలు తిష్ఠవేసి మొన్న నే కదిలాడు. తల్లికి ఈ మధ్య ఒంట్లో బాగోలేదు.- "ఎవరుశాశ్వతం"? అనిపించింది రామ్మూర్తికి ఏడుపులోంచి "నేను" అని అరిచింది జనత. నోరు మూసుకున్నాడు.

పూర్వం వొచ్చిన 'యాంత్రికం' మళ్లా బలపడుతున్నది. తను చేసేపనులూ, ఒకదాని తరువాతొకటి కలిగే మార్పులూ, ఇవన్నీ ఆలోచిస్తున్నకొద్దీ యాంత్రికంగా కనిపిస్తున్నాయ్. ప్రతివాడు బాల్యంలో ఎల్లాటి మనస్తత్వంతో మెలుగుతాడో తను అట్లాగే మెలిగాడు....పెద్దవాడయ్యాడు. పెళ్ళి....తరువాత జీవితంలో 'ఇంటరెస్టు' తగ్గడం, ఆలోచించడం—వెనక్కి....యిది.... యిదంతా యాంత్రికం. అవునవును.... అతని మనసు వొప్పుకున్నది. తర్కం ...తర్కం! ఎలా... నిజమేనా యిదీ... ఎదురుగా యాంత్రికం వెరగలేదు.

రామ్మూర్తికి నలభై ఏళ్ళు నిండినయ్ బాధ్యతలు నెత్తిమీద వేసుకోవడం అంటే చిరాకు ...భయమూనూ. సమస్యలు ఎక్కువౌతున్నాయ్. అసలు జీవితమే ఒక సమస్యల పుట్టలా కనిపించింది. కొన్నాళ్ళ అనుభవంతో చెప్పగల ఒకానొక విషయం ఏమిటంటే తను పరిష్కరించలేని సమస్యని కాలానికి వదిలెయ్యడమే! ఎంతగడ్డు సమస్యయినా కాలంచేతిలో ఓ మూలకి వచ్చి చేరుతుంది.

మాటి మాటికి పరిక్షే....తన కార్యనిర్వహణా ధురంధరతని దేవుడు ఎన్నిసార్లని పరీక్షిస్తాడు? ఒకటి నెగ్గితే మరొకటి! యీ జీవితం ఒకవేళ పరీక్షల గొలుసేమో—?

యీ విషయాన్ని కూడా యాంత్రికం క్రింద జమకట్టడానికి ప్రయత్నించాడు
కాలం పది సంవత్సరాలు పరిగెత్తింది.
ఆలోచన తగ్గలేదు రామ్మూర్తికి

యేమిటో ఈ సంసారం, సంఘం, ప్రపంచం, జీవితం ఇవన్నీ విచిత్రంగా కనిపిస్తున్నాయి రామ్మూర్తికి వాటిని విజ్ఞానంతో కొలుద్దామని ఆతృత. కానీ ఈ ఆలోచన, ఆతృత, అతనిలోని శాంతిని తుడిచివేశాయి. క్రొత్తగా గ్రహించాడు ఒక విషయం ఈ మధ్యనే, యాభై సంవత్సరాల వయస్సులో! జీవితాన్ని గురించి ఆలోచించి దాని కిటుకును కనుక్కుందామని, దాని రహస్యం తెలుసుకుందామని

ఆలోచించే తనబోటిగాళ్ళకి భస్తే జీవితంలో శాంతి దొరకదు. తన రహస్యం తెలుసుకుందామని తనపై దండెత్తేవాళ్ళని ఎట్లాశిక్షించాలో జీవితానికి తెలుసును.

ఇది అతను తెలుసుకున్న విషయం!

రామ్మూర్తి తాతయ్యగారు కూడా ఐనాడు. కూతురికి పెళ్ళిచేశాడు. ఆమెకు మళ్లా కూతురు-పాపం. కొడుకు జబ్బల్‌పూర్‌లో ఇంజనీరు ఉద్యోగం చేస్తున్నాడు యిద్దరు పిల్లల్తో. మూడో ఆడ పిల్లకు మొన్న మొన్ననే పెళ్ళిచేశాడు. వచ్చే జనవరిలో తను రిటరయిపోతాడు, అప్పుడిక తనుచెయ్యవలసిన పని ఏముంది....

మళ్లా పైకొచ్చింది మనసులో పడుకున్న జీవితం మీద పగ 'అవును! తేల్చుకోవాలి దాని సంగతి' అనుకున్నాడు గట్టిగా.

అందరూ యెవళ్ళింటికి వాళ్లు వెళిపోతే ఇల్లంతా చిన్నబోయిందని సీతమ్మ తెగ వాపోతున్నది. పురాణ కాలక్షేపాలు ఎక్కువయినయ్ ఆవిడకు. రామ్మూర్తికి విసుక్కోవడం, కసురుకోవడం ఎక్కువయినాయి.

తండ్రి వదిలిపోయిన ఆస్తి దానా దీనా కరిగి పాతికెకరాలల్లా ఐదు ఎకరాల్లోకి దిగింది. యేమయినా తిండికి తడుముకోకుండా, రిటరయిన దగ్గరునుంచి ఫించను డబ్బులు కోసం ఆశించకుండా హాయిగా కాలం గడపొచ్చు.

రామ్మూర్తిగారు జనవరిలో రిటరైనారు. టీపార్టీ, వీడ్కోలు, ఫోటోలు- వగైరా ముగిసి తొమ్మిది గంటలకి ఇంటికొచ్చారు. అప్పటికే కొంచెం దగ్గు ప్రారంభమైంది. తెల్లారేసరికి జబ్బు చేసింది. ఆ మరునాటి సాయంకాలానికి ఇల్లు కళ కళ లాడుతున్నది కూతుళ్లూ అల్లుళ్ళతో. కొడుకు ఆలస్యంగా వచ్చాడు, కోడలిని తీసుకురాకుండా. జబ్బునీ. వాళ్ళనీ పోల్చిచూశాడు, తేడా కనిపించలేదు. జబ్బు పిలవకుండా వచ్చింది వాళ్ళు పిలిస్తే వచ్చారు. అంతే తేడా.

జబ్బు చాలాతీవ్రంగావుంది తన రహస్యం అంత పెద్దడాక్టరుక్కూడా ఇన్నాళ్ళ నుంచీ తెలియనీయకుండా ప్రవర్తిస్తున్నది, జబ్బు—జీవితానికి మల్లేనే. రామ్మూర్తికి ఇంత జబ్బులోనూ ఆలోచనపోలేదు. ఇవాళ పడక కుర్చీలోకూర్చొని బత్తాయి తొనలు తింటున్నాడు. బత్తాయికాయ పూర్తయేసరికి రామ్మూర్తి మస్తిష్కంలో యాదృచ్ఛికంగా ఏదోమార్పు వచ్చినట్టయింది. దానికి కారణం అతను చెప్పలేడు.

ఉన్నట్టుండి కలిగిన మార్పు—జీవితం మీద పగ పోవడం! ఇన్నాళ్ళూ దానిని పడగొడదామని ఆలోచించినా తన అంతర్యం, జీవితంతో రాజీచేసుకుందో లేక జీవితమే తన అంతర్యాన్ని తన శక్తిచేత తనతో స్నేహం చేయించుకుందో తెలీదు. గొప్పపశ్చాత్తాపం పొందాడు. కుర్చీలో కూర్చునే అట్లా కన్నీళ్ళు బొటా

బొటా కార్చేడు. "తను! ఎంత తప్పుచేశాడు. జీవితం మరోలా గడపవలసింది. మరోలా....అయ్యో! ఇన్నాళ్ళూ తనకి స్ఫురించలేదు. ఏదో గొప్పది సాధించి వుండవలసింది....ఔను అయ్యో....

మనుమడు బెదురుతూ తన గదిలోకొచ్చి తనని చూసి బెదిరి వెళిపోయాడు. వాణ్ణి ఎత్తుకుందామనిపించింది. తను ఏదో పెద్దతప్పుచేసినట్టూ.ఎవర్నో ద్రోహం చేసినట్టూ—భావించుకుని బెంబేలు పడుతున్నాడు.

జ్వరం, జబ్బు అన్నీ శాంతించినయ్, మనసుతోపాటే. అంతా వెళిపోయారు. ఈసారి వాళ్ళని ఉండమన్నాడు రామ్మూర్తి. వాళ్ళు ఆశ్చర్యపోయారు. ఎప్పుడూ జరగనిది జరుగుతున్నదని.! ''మళ్ళీ వస్తాం నాన్నా, ఆయనకి సెలవు అయిపోయింద''ని ఇద్దరు కూతుళ్ళూ అల్లుళ్ళతో వెళిపోయారు. కొడుకు'ఉండనా' అని అడిగాడు. మాటాళ్ళేదు రామ్మూర్తి.

రామ్మూర్తిబాధ వొకటే. తను యింత ఆలస్యంగా మేల్కొన్నానేమా అని. 'జీవితం అంతా ముందుకు నడిచివచ్చి చూడు నేనెంత అందంగా వున్నానో అన్నది. అవునవును! నాదే తప్పు! నిన్ను శత్రుభావంతో, ఎందుకో తెలియని ద్వేషంతో, అసహ్యంతో చూశాను. అనుమానించాను పశ్చాత్తాపం' అన్నాడు మనసుతో మనసు దూరంగా వెళ్ళింది.

ఇప్పుడు రామ్మూర్తి మనసుకు 'యాంత్రికం' అనే పదంతెలియదు. మరిచిపోయింది. యెవరయినా 'యాంత్రికం జీవితం' అంటే వణుకుతూ నయినా సరే వాదిస్తాడు కాదని, ఈ లేటు వయసులో.

[రచన : 1961, మహారాజ కళాశాల పత్రిక, విజయనగరం, ఫిబ్రవరి 1962లో ప్రచురితం]